సాక్షి
చిత్తూరు
సోమవారం । 21 । అక్టోబర్ । 2024



బోయకొండ కిటకిట
జిల్లాలోనే పవిత్ర పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ నిలయం సెలవురోజైన ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. - 8లో



అమరులకు జోహార్
అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం చిత్తూరు ఏఆర్ మైదానంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. - 8లో



ఆవు దొంగలపై కేసు
పశువులను దొంగలించి, వాటిని వధించి, ఆ మాంసాన్ని విక్రయించే వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని ఆదేశించారు.

పోలీసు గ్రీవెన్స్ మార్పు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఈ గ్రీవెన్స్‌ను చిత్తూరు వన్‌టౌన్ పక్కనున్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు ఆదివారం ఓ దాత రూ.1,00,116 అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రమణయ్య నగదును ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాత కుటుంబ సభ్యులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అన్నదానం ట్రస్టుకు..

కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి నిత్య అన్నదానం ట్రస్టుకు ఆదివారం దాత రూ.లక్ష నగదును విరాళంగా అందించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ కేశాని రూ.1,00,116 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అధికారులు దాతకు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 80,741 మంది స్వామివారిని దర్శించుకోగా 31,581 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



పుంగనూరు లద్దిగం చెరువులో జేసీబీలతో ఇసుకను తవ్వుతున్న దృశ్యం

లద్దిగం చెరువు.. తమ్ముళ్ల కల్పతరువు

అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. కాసుల దాహంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తిస్తున్నారు. అందినకాడికి అడ్డదిడ్డంగా దోచేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో 1,500 ఎకరాల ఆయకట్టుకు నీరందించే చెరువును చెరబట్టేశారు. కిలోమీటర్ల మేర తవ్వేసి, వందల అడుగుల మేర గుంతలు తీసి చెరువు గర్భంలో ఉన్న ఇసుకను తోడేశారు. యంత్రాలు పెట్టి తవ్వకాలు సాగించేశారు. గుండెమండిన రైతులు తమ్ముళ్లకు ఎదురు తిరిగారు. చెరువును యథాస్థితికి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

- 100 అడుగుల లోతులో కిలోమీటర్ల మేర తవ్విన వైనం
- పగలు ట్రాక్టర్లు.. రాత్రి టిప్పర్లతో రవాణా
- జేసీబీలను అడ్డుకున్న రైతులు

పుంగనూరు: లద్దిగం చెరుకు ఇసుకాసురుల అక్రమ వ్యాపారానికి అడ్డాగా మారింది. అధిక సంఖ్యలో తుమ్మచెట్లు ఉండటం 'తమ్ముళ్ల'కు బాగా కలిసొచ్చింది. ఇక్కడ ఇసుక తరలిస్తున్నా ఎవరికీ కనీసం అనుమానం కూడా రావడం లేదు. దీంతో తమ్ముళ్ల వ్యాపారం మూడు ట్రిప్పులు... ఆరు ట్రక్కులుగా మారింది. ఇప్పటి వరకూ చెరువులో ఆరు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర కాలువలు తీసి ఇసుకను తినేశారు. వివరాల్లోకి వెళితే... చౌడేపల్లె మండలం, లద్దిగం గ్రామ పరిధిలో పెద్ద చెరువు ఉంది. ఇది సుమారు 750 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పుంగనూరు, చౌడేపల్లెకు సంబంధించిన లద్దిగం, చదళ్ల, పుదిపట్ల, తిరుమణపల్లె, అంకుతోటపల్లె, ఎ.కొత్తకోట, బండ్లపల్లె, నల్లూరిపల్లె, కొత్తపల్లె, ఏతూరు, పెంచుపల్లె గ్రామాల్లోని సుమారు 1,500 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తోంది.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రైతులు

లద్దిగం పెద్ద చెరువులో టీడీపీ నాయకులు, వ్యాపారి ప్రసాద్‌రెడ్డితో కలిసి చెరువును తవ్వి ఇసుక తరలించడంపై రైతులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. చెరువును పూడ్చి యథాస్థితిలో ఉంచేంత వరకు జేసీబీలు, టిప్పర్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని రైతులు స్పష్టం చేశారు. వారు మాట్లాడుతూ 100 అడుగుల లోతు, కిలోమీటర్ల పొడవుతో కాలువలు తీశారని, దీని కారణంగా నీటి నిల్వలు లేక భూగర్భజలాలు అడుగంటిపోయాయని వాపోయారు. రోజుకు 200 వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు రాజశేఖర్ రెడ్డి, అగస్తిరెడ్డి డిమాండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై మంత్రులు, జిల్లా కలెక్టర్, రూరల్ సీఐకి ఫిర్యాదు చేశామని, తక్షణమే కేసు నమోదు చేయాలని, జేసీబీలు, టిప్పర్లు సీజ్ చేసి ఇసుక అక్రమ రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా..

రైతులు ట్రాక్టర్లలో తమ అవసరాల నిమిత్తం ఇసుక తరలించుకోవచ్చన్న ప్రభుత్వ ప్రకటన తమ్ముళ్లపాలిట వరంగా మారింది. దీన్ని ఆసరాగా మలచుకొని ఎవరికీ అనుమానం రాకుండా పగటిపూట ట్రాక్టర్లలో స్థానికులకు ఇసుక సరఫరా చేస్తున్నారు. ఆపై రాత్రిపూట టిప్పర్లతో పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రానికి తరలించేస్తున్నారు. అయితే చెరువులో ఇసుక తవ్వేందుకు నీరు అడ్డు రావడంతో పనులు సాగడం లేదు. దీంతో పైపులు వేసి నీటిని వృథాగా బయటకు పంపేస్తున్నారు. వాహనాల రాకపోకలకు వీలుగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసి ఏకంగా చెరువు రూపురేఖలే మార్చేశారు. ఇక ఇసుక ట్రాక్టర్‌కు లోడింగ్ చేసినందుకు రూ.2వేలు, టిప్పర్‌కు రూ.13వేలు వసూలు చేస్తున్నారు. రాత్రి సమయాల్లో టిప్పర్లను కర్ణాటకు తరలించి ఇసుక ఒక్కో టిప్పర్‌కు రూ.15వేలు వసూలు చేస్తున్నారు.

నెల్లూరి వాసే సూత్రధారి

ఇసుక అక్రమ రవాణాకు మూల సూత్రధారి నెల్లూరు జిల్లాకు చెందిన ప్రసాద్‌రెడ్డి అని తెలిసింది. ఇతనికి స్థానిక టీడీపీ నేతలు సహకరిస్తున్నారని, ఇసుక వ్యాపారం సజావుగా సాగేందుకు కూటమి నేతలకు ప్రతినెలా లక్షలాది రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నట్లు స్థానిక రైతులు చెబుతున్నారు.

లద్దిగం చెరువులో జేసీబీలను అడ్డుకుంటున్న రైతులు





రోజుకు 200 వాహనాల్లో తరలింపు



లద్దిగం చెరువు నుంచి రోజూ 200 ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నారు. 11 గ్రామాల రైతులకు ఆధారమైన చెరువులో రోడ్లు వేసి హిటాచీలతో 100 అడుగుల లోతు కాలువలు తీశారు. ఇసుకను అక్రమంగా తరలించి, లక్షలాది రూపాయలకు విక్రయించారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఆందోళనలు చేస్తాం.

– రాజశేఖర్‌రెడ్డి, రైతు, లద్దిగం

నాశనం చేశారు



రైతులకు ఎంతో అవసరమైన చెరువుల్లో మట్టి, ఇసుక తవ్వకాలు చేపట్టి, చెరువులను నాశనం చేస్తున్నారు. ప్రతి రోజు వందలాది లోడ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తూ వ్యాపారం చేసేవారిపై కేసులు నమోదు చేయాలి. 1,500 ఎకరాల ఆయకట్టుకు నీరు లేకుండా అధికార పార్టీ వారు చేయడం బాధాకరం. చెరువు కింద ఉన్న బోర్లు ఎండిపోయాయి. ప్రభుత్వం దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– అగస్తిరెడ్డి, రైతు, బండ్లపల్లి

రైతులను ముంచేశారు



11 గ్రామాల రైతులకు అవసరమైన లద్దిగం చెరువులో ఇసుకను తరలించి, రైతులను ముంచేస్తున్నారు. మాకు వ్యవసాయమే ప్రధాన వృత్తి. ప్రస్తుతం వస్తున్న నీటిని సైతం మోటార్లతో పక్కకు పంపుతూ వృథా చేస్తున్నారు. దీని కారణంగా భూగర్భజలాలు అడుగంటిపోతాయి. రైతుల పొలాలు బీడుభూములుగా మారిపోతాయి. ఎవరైనా చెరువుల జోలికి వస్తే సహించేది లేదు. చెరువులను నాశనం చేస్తున్న వారిపై కేసులు పెట్టాలి.

– కృపాకర్‌రెడ్డి, రైతు, లద్దిగం

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన ఆలయ అలంకార మండపంలో సిద్ధి బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ మూర్తులను సుగంధ పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో జరిపించారు. భక్తులు నిష్టతో వ్రతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

స్వర్ణరథంపై అభయం

స్వయంభు శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆదివారం రాత్రి ఆలయ మాడవీధుల్లో స్వర్ణరథంపై అభయమిచ్చారు. ప్రధాన ఆలయంలో సాయంత్రం అలంకార మండపంలో ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చక, వేద పండితులు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి స్వర్ణ రథంలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామిని దర్శించుకున్నారు.



బంగారు రథంలో స్వామి ఊరేగింపు



వ్రతంలో పాల్గొన్న భక్తులు

నవంబర్ 11 లోపు ఇంటర్ ఫీజు చెల్లించాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులు నవంబర్ 11వ తేదీ లోపు సంబంధిత కళాశాలల్లో ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలని డీవీఈఓ సయ్యద్ మౌలా వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న ప్రథమ, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్, ప్రైవేట్, హాజరు మినహాయింపు పొందిన విద్యార్థులు ఈ నెల 21వ తేదీ నుంచి నవంబర్ 11 లోపు ఫీజు చెల్లించాలన్నారు. రూ.1000 అపరాధ రుసుముతో చెల్లించడానికి నవంబర్ 20 వరకు అవకాశం ఉంటుందన్నారు. ఆర్ట్స్, హ్యూమానిటీస్ విద్యార్థులు https://biev2.biev2.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నవంబర్ 15 లోగా హాజరు మినహాయింపు కోసం రూ.1500 ఫీజు చెల్లించాలని డీవీఈఓ వెల్లడించారు.

అడ్రస్ లేని అండర్‌పాస్

- హైవే దెబ్బకు బ్రిటీషర్ల రోడ్డు మాయం
- గడ్డూరు కాలనీతోపాటు ఇరవై గ్రామాలకు దారేదీ?
- పలు మండలాల్లో గ్రామాలు, కాలనీలకు దారులు మాయం
- హైవేకి ఇరువైపులా ఎవరూ వెళ్లకుండా ఫెన్సింగ్ నిర్మాణం



గడ్డూరుకాలనీకి దారిలేకుండా పోయిన దృశ్యం

పలమనేరు: నియోజకవర్గం మీదుగా సిక్స్‌ట్రాక్ ఎక్స్‌ప్రెస్ హైవే వస్తోందనగానే ఈ ప్రాంతవాసులు ఆనందపడ్డారు. కానీ ఇప్పుడు ఈ ఎక్స్‌ప్రెస్ హైవే ఎంత పనిచేసిందిరా సామీ అంటూ బాధపడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేకు రెండు వైపులా ఎవరూ వెళ్లకుండా సిమెంట్‌తో ఫెన్సింగ్ నిర్మించేస్తున్నారు. అవసరమైన చోట అండర్ పాస్‌లను నిర్మించలేదు. ఫలితంగా పదుల సంఖ్యలో గ్రామాలు, కొన్ని కాలనీలు, పొలాల వద్దకు వెళ్లే దారులు లేకుండాపోయాయి. ఈ సమస్యను ఎవరు పరిష్కరిస్తారోనని బాధిత గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిటీషర్ల కాలంనాటి రోడ్డుకు ఎసరు

బ్రిటీషర్ల హయాంలో పట్టణానికి బైపాస్‌గా టి.వడ్డూరు క్రాస్ నుంచి గడ్డూరుకాలనీ, కిండర్ కేర్ మీదుగా మెయిన్‌రోడ్డును కలిపేలా ఈ బైపాస్ రోడ్డును 80 అడుగులతో అప్పట్లో నిర్మించారు. అయితే ఈ రోడ్డుకు అడ్డంగా ఇప్పుడు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించడంతో నాటి బ్రిటీషర్ల దారి మాయమైంది.

ఎన్నో గ్రామాలు, కాలనీలకు ఇదే పరిస్థితి

ఎక్స్‌ప్రెస్ హైవే కర్ణాటకలోని హుల్కూర్ నుంచి వి.కోట మండలంలో ప్రవేశిస్తోంది. అక్కడి నుంచి బైరెడ్డిపల్లి, పలమనేరు, బంగారుపాళెం, గుడిపాల మండలాల మీదుగా తమిళనాడుకు వెళుతోంది. ఈ మార్గాల్లోని పదుల సంఖ్యలో గ్రామాలు, పొలాలవద్దకెళ్లే దారులు ఇప్పుడు లేకుండా పోయాయి. దీంతో రైతులు పొలం పనులకు, పశువుల మేతకు ఎలావెళ్లాలో దిక్కుతోచడం లేదు. ముఖ్యంగా బైరెడ్డిపల్లి కొత్త కాలనీకి నాలుగు కిలోమీటర్లు చుట్టుకొని వెళ్లాల్సిందే. గ్రామాలు, దారులు, కాలనీలున్న చోట ఎక్స్‌ప్రెస్ హైవే నిర్వాహకులు అండర్ పాస్‌లు అప్పట్లో ప్రతిపాదించకపోవడమే బాధితులకు శాపంగా మారింది. దీనిపై ఎన్‌హెచ్ అధికారులను అడిగినా తమకు సంబంధం లేదనే మాట వినిపిస్తోంది. ఈ సమస్యపై స్పందించి మున్సిపల్ కమిషనర్ ద్వారా ఎన్‌హెచ్ఏఐ వారికి లేఖ రాయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి తెలిపారు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఈ సమస్యను పరిష్కరించాలని నియోజకవర్గంలోని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాలనీకి దారి లేదు

మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు, బోడిరెడ్డిపల్లి ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో సుమారు నాలుగువేల కుటుంబాలున్నాయి. ఎక్స్‌ప్రెస్‌హైవే రాకముందు ఇక్కడి ప్రజలు కూర్మాయి రోడ్డు, బ్రిటీషర్ల కాలంనాటి 80 అడుగుల రోడ్డు నుంచి రాకపోకలు సాగించేవారు. అయితే ఈ రోడ్ల మధ్య ఇప్పుడు ఎక్స్‌ప్రెస్‌హైవే రావడంతో కాలనీకి దారిలేకుండా పోయింది. దీంతో వీరు తావడపల్లి రోడ్డులోగాని, అటు కౌండిన్య వైపు నుంచి సైతం వెళ్లేందుకు వీలు లేకుండా అష్ట దిగ్బంధంలో చిక్కుకున్నారు. మరోవైపు గడ్డూరు వద్ద అండర్‌పాస్ నిర్మాణం లేకుంటే కూర్మాయి మార్గం ద్వారా రూరల్ మండలంలోని 20 గ్రామాలకు ఇబ్బందులు తప్పవు.

సిమెంట్ ఫెన్సింగ్

ఎక్స్‌ప్రెస్‌హైవేకి ఇరువైపులా మనుషులు, కుక్కలు, మూగజీవాలు, ఇతర వాహనాలు వెళ్లకుండా చేయడంలో భాగంగానే కాంట్రాక్టర్లు ఈ రోడ్డుకు ఇరువైపులా సిమెంట్‌తో అడ్డుగా ఫెన్సింగ్ నిర్మిస్తున్నారు. దీన్ని బట్టి ఎక్కడైతే ఇతర రోడ్లకు కనెక్టింగ్ పాయింట్ ఉంటుందో అక్కడ తప్ప ఎవరూ దీనిపైకి వెళ్లడం సాధ్యం కాదు. అయితే అవసరమైన చోట్లలో మాత్రం అండర్‌పాస్‌లు కట్టాల్సి ఉంది. కానీ కాంట్రాక్టర్లు అండర్‌పాస్‌లు నిర్మించకపోవడంతో ఇప్పుడు సమస్య మొదలైంది.



పట్టణ సమీపంలోని బ్రిటీషర్లనాటి రోడ్డుకు అడ్డుగా ఎక్స్‌ప్రెస్‌హైవే



గ్రామాలకు వెళ్లే దారులకు అడ్డుగా వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌హైవే

ఏపీ మందు వద్దు.. టెట్రానే ముద్దు



కారుచౌకగా దొరికే కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ఇవే

పలమనేరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ద్వారా ప్రైవేటువాళ్లకు మద్యం దుకాణాలు కేటాయించింది. అయితే అధికారపార్టీ వారే అన్నిచోట్ల సిండికేట్‌గా మారి ఇష్టానుసారంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారు. సీఎం చంద్రబాబు మాత్రం నాణ్యమైన మద్యం క్వార్టర్ రూ.99కే ఇస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయి. నాణ్యమైన మద్యం మాట దేవుడెరుగు పాత మద్యమే ఇప్పటికే అందుబాటులో ఉంది. దానికి తోడు గత ప్రభుత్వంలో కంటే ఇప్పుడే మద్యం ధరలు అధికంగా ఉన్నాయి. కూటమి రాగానే ఏమో జరిగిపోతుందని కలలుగన్న మందుబాబుల పరిస్థితి ఇప్పుడు మరీ ఘోరంగా తయారైంది. దీంతో నాణ్యమైన మద్యం తక్కువ ధరకే దొరుకుతున్న కర్ణాటక సరిహద్దుల్లోని టెట్రా ప్యాకెట్లకు పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల మందుబాబులు క్యూకడుతున్నారు.

జోరందుకున్న కన్నడ మద్యం రవాణా

గత ప్రభుత్వంలో కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు ఎస్ఈబీ, ఎక్సైజ్, స్పెషల్ స్క్వాడ్, సెబ్ బోర్డర్ స్క్వాడ్‌తోపాటు సంబంధిత మండలాల పోలీసులు కన్నడ మద్యం అక్రమ రవాణాకు కళ్లెం వేస్తూనే వచ్చారు. ఇప్పుడు సెబ్ మళ్లీ ఎక్సైజ్‌గా మారింది. వీరు కొత్త మద్యం దుకాణాల ఏర్పాటులో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదనుగా గతంలో కంటే ఎక్కువగా కర్ణాటక మద్యం అక్రమ రవాణా ఇప్పుడు ఎక్కువైంది. అయితే ఇక్కడి మద్యం సిండికేట్ గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి కన్నడ మద్యానికి అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. ఏదేమైనా కొత్తగా ఇక్కడ షాపులు దక్కించుకున్న వారు బాగా సంపాదించుకోవచ్చని అనుకుంటే, కన్నడ టెట్రాదెబ్బ వీరికి తప్పేలా లేదు.

కన్నడ టెట్రాపై తగ్గని మోజు



ఇటీవల కన్నడ టెట్రా ప్యాకెట్లను సీజ్ చేసిన పోలీసులు(ఫైల్)

కర్ణాటకకు చెందిన విస్కీ, ఒరిజినల్ చాయిస్, డీలక్స్ విస్కీ, త్రిబుల్‌ఎక్స్ రమ్, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ తదితర బ్రాండ్లు 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్ రూ.40గా ఉంది. అదే క్వార్టర్ టెట్రా ప్యాకెట్ అయితే రూ.80గా ఉంది. ఇదే మద్యం ఇక్కడ రూ.170 నుంచి రూ.220 దాకా ఎమ్మార్పీ ఉండగా సిండికేట్ ధరకు అమ్ముతున్నారు. దీంతో మందుబాబులు బోర్డర్ బాట పడుతున్నారు. ఫలితంగా పలమనేరు నియోజకవర్గ సమీపంలోని కర్నాటక నంగళి, తిమ్మరాయనిగ్గిల్లి, వీకోటకైతే కర్ణాటక సరిహద్దు పర్లాంగు దూరంలోనే ఉంది. ఇక కుప్పం నియోజకవర్గంలో కేవలం ఐదు నుంచి పది కిలోమీటర్లలోనే పదుల సంఖ్యలో కన్నడ మద్యం షాపులున్నాయి. పుంగనూరు నియోజకవర్గం రాజుపల్లి వద్ద పలు కర్నాటక మద్యం దుకాణాలున్నాయి.

క్లుప్తంగా

బోయకొండ కిటకిట


విశేష అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. సెలవురోజు కావడంతో అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో ఒక్కసారిగా భక్తుల రద్దీతో పెరగడంతో క్యూలన్నీ నిండి కిటకిటలాడాయి. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్‌ను ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామికణ్ణన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. దీపావళి కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్‌కు 12వ వేతన సవరణ రిపోర్ట్ వచ్చే లోపు 30 శాతం తాత్కాలిక భృతిని మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. పీఆర్‌సీ ఆలస్యం అయితే ఐఆర్ ఇచ్చే సంస్కృతి గతంలో ఉండేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఐఆర్‌ను మంజూరు చేయాలని వారు కోరారు.

అమరులకు జోహార్!

- ప్రాణాలను పణంగా పెడుతున్న ఖాకీలు
- అశువులు బాసిన పోలీసు కుటుంబాలకు భరోసా
- జిల్లాలో ఏటా పోలీసు అమర వీరుల దశోత్సవాలు
- నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం


అమరవీరులకు వందనం సమర్పిస్తున్న పోలీసులు (ఫైల్)

చిత్తూరు అర్బన్: ఖాకీ.. ఆ దుస్తులు చూస్తేనే ఓ ధైర్యం. ఆ రంగు దుస్తులు ధరించి దర్జాగా రోడ్డుపై వస్తుంటే తప్పు చేసేవారి వెన్నుల్లో వణుకు రావాల్సిందే. వేధింపులకు గురవుతున్న ఆడపడుచులకు పోలీస్ అనే పిలవడమే తరువాయి.. నిందితుల పాలిట సింహస్వప్నంగా నిలుస్తున్నారు. అలాంటి పోలీసులు విధి నిర్వహణలో ఒక్కోసారి ప్రాణాలను సైతం పణంగా పెట్టాల్సిన విషమ పరిస్థితులు వస్తుంటాయి. అయినాసరే ఎక్కడా అదరరు. బెదరరు. ప్రాణాలు పోయినా సరే ప్రజల మాన, ప్రాణాలను కాపాడుతూ అమరులైన పోలీసులను స్మరిస్తూ ఏటా అక్టోబర్ 21న జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సారి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అమరులైన పోలీసులకు శ్రద్ధాంజలి ఘటించి.. పోలీసు సేవల్ని ప్రజల్లో తీసుకెళ్లడానికి పది రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడానికి పోలీసు అధికారులు సన్నద్ధమయ్యారు.

మన జిల్లాలో..

పోలీసుగా విధులు నిర్వర్తిస్తూ అసాంఘిక శక్తుల చేతిల్లో ప్రాణాలు పోగొట్టుకున్నవారు జిల్లాలో ఆరుగురు ఉన్నారు. వీరిలో 1996లో కర్నూలులో జరిగిన కూంబింగ్‌లో జిల్లాలోని ములకలచెరువులో పనిచేసిన కానిస్టేబుల్ అశ్వర్థనారాయణ నక్సల్‌కు పోలీసులకు జరిగిన కాల్పుల్లో మరణించారు. 2007లో అప్పటి చిత్తూరు ఎమ్మెల్యే సీకే బాబుపై జరిగిన రెండు వేర్వేరు హత్యాయత్నంలో అంగరక్షకులుగా పనిచేస్తున్న హుస్సేన్ బాషా, సురేంద్ర అమరులయ్యారు. వీరిలో ఒకరు నిందితుల బుల్లెట్లకు బలైతే.. మరొకరు మందుపాతరపేలి వీర మరణం పొందారు. 2017లో పలమనేరు అడవుల్లో ఓ మహిళను అత్యాచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే సమాచారం రావడంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జవహర్‌నాయక్, హోంగార్డు దేవేంద్ర నిందితులను వెతుక్కుంటూ వెళ్లారు. నిందితులను పట్టుకునే క్రమంలో వీరిద్దరూ ప్రాణాలు పోగొట్టుకున్నారు. వీరితో పాటు గతేడాది పుంగనూరులో టీడీపీ నేతల దాడిలో 50 మందికి పైగా పోలీసులు గాయపడ్డారు. ప్రాణాలకు తెగించి శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం శాయశక్తులు ఒడ్డింది. ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐ నుంచి కానిస్టేబుల్ వరకు రక్తాన్ని చిందించారు. ఈ దాడిలో రణధీర్ అనే స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ తన కంటి చూపును కోల్పోయాడు. వీళ్ల ధైర్యానికి బాసటగా పోలీసు యంత్రాంగం అందర్నీ సత్కరించింది. వీరితో పాటు విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారికి సైతం జిల్లా పోలీసు యంత్రాంగం ప్రతి ఏటా నివాళులర్పిస్తోంది.

చరిత్ర ఇది

1959, అక్టోబర్ 21న 10 మంది జవాన్లు అమరులయ్యారు. భారత్–టిబెట్ సరిహద్దుల్లో ఉన్న లడఖ్‌లోని అక్సాయ్‌చిన్ వద్ద భారత్‌కు చెందిన కేంద్ర రిజర్వ్ పోలీసులు (సీఆర్‌పీఎఫ్) సరిహద్దు రక్షణలో ఉన్నారు. విపరీతమైన చలిలో పది మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వర్తిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో మన దేశ సరిహద్దులోకి చొచ్చుకువచ్చారు. వారిని ఈ పది మంది పోలీసులు ధైర్యంగా ఎదిరించి, చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి, దేశం కోసం అశువులు బాశారు. భారతదేశ రక్షణ కోసం పోలీసులు ప్రాణాలు వదిలిన తొలి సందర్భం అది. ఇందుకు గాను అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు 1960 జనవరి 9న సమావేశమై అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తీర్మానించారు. ఫలితంగా దేశ వ్యాప్తంగా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు.

ఏఆర్ మైదానంలో పరేడ్


అమరవీరుల దినోత్సవానికి ముస్తాబైన ఏఆర్ మైదానం

పోలీసు అమరవీరులకు నివాళులర్పించడానికి చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీసు మైదానంలో ఏర్పాట్లు సిద్ధం చేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక తిరుపతి నగరంలో కూడా పోలీసు ఏఆర్ మైదానంలో పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసుల ప్రదర్శనలు ఇవ్వడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిని తిలకించడానికి పౌరులు సైతం పాల్గొనవచ్చు.

ప్రతి రోజూ ఓ చాలెంజ్



"పోలీసు ఉద్యోగమంటేనే సమస్యలతో కూడుకుంది. యూనిఫామ్ వేసుకుని బయటకొచ్చాక ప్రతి రోజూ ఓ కొత్త చాలెంజ్ ఎదురవుతుంది. కుటుంబం, సమాజం రెండు ఒక్కటే అనే భావన పోలీసులకు ఉంటుంది. ఒక్కోసారి ఈ వృత్తిలో ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ఎలాంటి సమస్య వచ్చినా ఎదురెళ్లడమే పోలీసు. ఈ నిరంతర ప్రక్రియలో అమరులైన పోలీసులను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. అలాంటి కుటుంబాలకు పోలీసుశాఖ ఎప్పుడూ అండగా ఉంటుంది. ఈసారి కూడా పది రోజుల పాటు జిల్లాలో అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

వెదురుకుప్పం: ఇతర వ్యక్తుల భూమికి సంబంధించి నకిలీ పత్రాలు తయారీ, ఫోర్జరీ కేసులో పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప కథనం మేరకు, మండలంలోని గంటావారిపల్లెకు చెందిన లేట్ వెంకటరెడ్డి కుమారుడు శ్రీపురం పుల్లా రెడ్డి అదే గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 513–6లో 0.66 సెంట్ల భూమికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు తయారు చేశారు. 1బి, అడంగల్ డాక్యుమెంట్లను తయారుచేసి పాకాల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో పుల్లారెడ్డి తోపాటు కుమారుడు జయచంద్రారెడ్డి అతని ల్యాప్‌టాప్‌లో నకిలీ పత్రాలను తయారు చేసినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారని తెలిపారు. అనుమానం రావడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్లు నకిలీవని తహసీల్దార్ నిర్ధారించారు. తహసీల్దార్ సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసినట్లు గుర్తించడంతో ఇటీవలే ఇద్దరిపై కేసు నమోదు చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అప్పట్లో రెండవ నిందితుడు జయచంద్రారెడ్డిని అరెస్టు చేశారు. మొదటి ముద్దాయి అయిన పుల్లారెడ్డిని శనివారం రాత్రి బ్రాహ్మణపల్లె వద్ద అరెస్టు చేసినట్లు సీఐ ఆదివారం వెల్లడించారు. నిందితుల వద్ద ఉన్న మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు తయారు చేసి అధికారులను తప్పుదోవ పట్టిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హనుమంతప్ప హెచ్చరించారు. వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజ్‌కుమార్

కార్వేటినగరం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి రోడ్డు సమీపంలో వ్యవసాయ పొలంలో ఆదివారం బయట పడింది. స్థానిక ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా... అమ్మపల్లి క్రాస్ నుంచి సురేంద్రనగరం వెళ్లే మార్గంలో గోపిశెట్టిపల్లి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తెలుసుకున్న ఎస్ఐ రాజ్‌కుమార్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఆరు రోజుల క్రితం పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఏబీ స్విచ్‌ను ఆఫ్ చేయడానికి ప్రయత్నించి మృతి చెంది ఉండవచ్చని చెప్పారు. అయితే మృతదేహం గుర్తుపట్టని విధంగా కుళ్లిపోవడంతో పాటు, తలకు ఉన్న జుట్టు ఊడిపోవడంతో గుర్తు తెలియడం లేదన్నారు. మృతుడికి 38 ఏళ్లు ఉండవచ్చని, 5.5 అడుగులు ఎత్తు ఉండవచ్చని అతను బ్లూకలర్ గళ్ల లుంగీ, పాచికలర్ కట్ బనియన్, ఎరుపు, తెలుపు గీతల టవల్ వేసుకున్నట్లు చెప్పారు. దీంతో అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94409 0069కు సమాచారం అందించాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం


నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్ఐ పరశురాం

బైరెడ్డిపల్లె : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పరుశురాం పేర్కొన్నారు. పూతలపట్టు మండలం రంగంపేట గ్రామానికి చెందిన గోవిందుస్వామి కుమారుడు శివానందన్ టాటాఏస్ వాహనంలో 2500 కిలోల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా బైరెడ్డిపల్లెలో పట్టుకున్నట్లు తెలిపారు. రేషన్‌బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని నిందితునిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

ఇద్దరిపై కేసు నమోదు

బైరెడ్డిపల్లె: అక్రమంగా రేషన్ బియ్యం, కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరుశురాం తెలిపారు. పూతలపట్టు మండలం రంగంపేటకు చెందిన గోవిందుస్వామి కుమారుడు శివానందం(45) టాటా ఏస్ వాహనంలో 2500 కిలోల రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తుండగా బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. మండలంలోని లక్కనపల్లెకు చెందిన నంద కర్ణాటక మద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్ నుంచి పడి మహిళకు గాయాలు

పుంగనూరు: పట్టణానికి చెందిన స్వాతి(26) ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళుతూ బస్టాండ్‌లో వాహనానికి సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రమాదాన్ని గమనించి ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ముగ్గురికి గాయాలు


ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పుంగనూరు: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ముగ్గురు యువకులను అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీకొనడంతో ముగ్గురు గాయపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని భగత్ సింగ్ కాలనీకి చెందిన ప్రవీణ్‌కుమార్, ధనుష్‌కుమార్, మనీష్‌గౌడ్ ముగ్గురు కలసి ద్విచక్ర వాహనంపై మదనపల్లె వైపు బయలుదేరారు. ఎదురుగా పుంగనూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు గాయపడ్డారు. స్థానికులు బాధితులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆవు దొంగలపై కేసు నమోదు

కార్వేటినగరం: ఆవును అపహరించి, వధించి మాంసాన్ని ఆటోలో తరలిస్తున్న దొంగలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం దిగువ గెరిగదొన గ్రామానికి చెందిన బి.హరిబాబు పశువులను కార్వేటినగరం రిజర్వ్ ఫారెస్టులో మేత కోసం వదిలిపెట్టారని చెప్పారు. మేత కోసం వెళ్లిన పశువును వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం ఎస్సీకాలనీకి చెందిన సూర్య, తరుణ్, ఎగువ గూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రి కలసి అపహరించారు. దాన్ని వధించి, ముక్కలుగా చేసి ఒక ఆటోలో బయల్దేరారు. అయితే ఆవు కోసం గాలిస్తూ వచ్చిన హరిబాబును, స్థానికులను చూసి నిందితులు పరారయ్యారు. వీరిపై హరిబాబు ఫిర్యాదు చేయడంతో ఆటోను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పశువుల దొంగలు జనసేన కార్యకర్తలేనా?

పశువులను వధించి, ఆ మాంసాన్ని తరలిస్తున్న ఆటోలపై పవర్‌స్టార్ ఫొటో, జనసేన బోర్డు ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. దీంతోపాటు నిందితులుగా పేర్కొన్న వాళ్లు కూడా జనసేన కార్యకర్తలుగా గ్రామాల్లో చలామణీ అవుతున్నారు. అయితే పశువులను వధించి విక్రయించడం అనేది దుర్మార్గమైన చర్య అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

25న చర్మకారుల సేవా సంఘం అధ్యక్షుడి రాక

తవణంపల్లె: ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర అధ్యక్షులు బాల్లా రాజారావు ఈ నెల 25వ తేదీన చిత్తూరుకు వస్తున్నారని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికారి ప్రతినిధి పులికింటి రమేష్ మాదిగ, చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మునెమ్మ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మురగయ్య, ప్రసాద్, వరదరాజులు తెలిపారు. జిల్లాలోని ఎస్సీలు, ఎస్టీలు, చర్మకారులు, డప్పుకళాకారులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

కార్యదర్శుల బదిలీ 'పంచాయతీ'

ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శులను గ్రేడుల వారీగా బదిలీ చేశారు. ఈ బదిలీ ప్రక్రియ జరిగి నెల రోజులైనా ఇంత వరకు వారికి కేటాయించిన పంచాయతీల్లో బాధ్యతలు అప్పగించలేదు. దీంతో వారు అటు వెళ్లలేక, ఇటు ఉండలేక గాల్లో తిరుగుతున్నారు. అధికార పార్టీ చెప్పే పనులకు మాత్రమే పరిమితమైన ఇన్‌చార్జి ఎంపీడీవో ఇతర అంశాలను పట్టించుకోవడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఏం చేయాలో దిక్కుతోచక ఊగిసలాడుతున్నారు. కార్యదర్శులు అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

- ఉద్యోగులపై పచ్చ చొక్కాల పెత్తనం
- పచ్చబ్యాచ్‌కు పక్కా ఏజెంట్‌గా ఇన్‌చార్జి ఎంపీడీవో
- దిక్కుతోచని స్థితిలో కార్యదర్శులు


విజయపురం ఎంపీడీవో కార్యాలయం

విజయపురం : మండలంలో మొత్తం 12 సచివాలయాల పరిధిలో సుమారు 16 మంది గ్రామ, సచివాలయ కార్యదర్శులు పని చేస్తున్నారు. వీరందరినీ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా గ్రేడుల వారీగా బదిలీ చేశారు. ఇందులో ఆలపాకం, శ్రీహరిపురం కార్యదర్శి నింద్ర, నగరికి బదిలీ కాగా మిలిగిన 14 మందిలో ఎనిమిది మందికి ఇంత వరకు రిలీవింగ్, జాయినింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో తమకు కేటాయించిన స్థానాలకు వెళ్లలేకపోతున్నారు. అటు పనిచేసే ప్రాంతంలోనూ ఉండలేక అయోమయంలో పడిపోయారు. అంతే కాకుండా ఇతర మండలాల నుంచి వచ్చే పంచాయతీ కార్యదర్శులు జాయినింగ్ ఆర్డర్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు తెలిసింది. తమకు కేటాయించిన పంచాయతీలో బాధ్యతలను అప్పగించాలని ఇన్‌చార్జి ఎంపీడీవోను బతిమాలుకుంటున్నా ఆయన పట్టించుకోలేదని ఆందోళన చెందుతున్నారు.

కుంటుపడుతున్న పాలన

బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతలను తీసుకోకపోవడంతో గ్రామాల్లో పాలన కుంటుపడింది. అంతే కాకుండా ఎవరైనా స్థానిక సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బదిలీపై వచ్చిన కార్యదర్శులకు బాధ్యతలను అప్పగించాల్సిన ఎంపీడీవో ఏమి చేస్తున్నారో, ఎక్కడున్నారో, అసలు పని చేస్తున్నారా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం ప్రజా సమస్యలపై ఎలాంటి బాధ్యతలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

మొదటి నుంచి వివాదస్పదమే

జిల్లా కేంద్రంలో ఏవోగా పని చేస్తున్న రమణ ప్రకాష్ ఈ ఏడాది ఫిబ్రవరిలో డిప్యూటేషన్‌పై విజయపురం ఏవోగా బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా పుల్లిచెర్ల మండలానికి బదిలీ అయ్యారు. అయితే అక్కడికి వెళ్లకుండా తన కులానికి చెందిన టీడీపీ నాయకుని సిఫార్సులతో విజయపురంలోనే ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయన బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మండల కార్యాలయం టీడీపీ కార్యాలయంగా మారిపోయింది. తనకు సిఫార్సు చేసిన నాయకుడు ఏది చెబితే అదే శాసనం అనే రీతిన వ్యవహారం సాగుతోంది. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నా బేఖాతర్ అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. అంతే కాకుండా తాను కార్యాలయంలో కన్నా పచ్చ చొక్కాల వద్దనే ఎక్కువగా ఉంటున్నారని చర్చ జరుగుతోంది. బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులకు ఇంత వరకు బాధ్యతలు అప్పగించలేదంటే ఆయన పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందని కార్యాలయ సిబ్బందే చెవులు కొరుక్కుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిపై స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.